క్లుప్తంగా

ఘనంగా మన్యుసూక్త హోమం



హోమం నిర్వహిస్తున్న అర్చకులు

మహారాణిపేట : మెయిన్‌రోడ్డులో వెలసిన శ్రీ ఆంజనేయ స్వామి వారి ఆలయంలో అశ్వయుజ పౌర్ణమిని పురస్కరించుకుని శనివారం మన్యుసూక్త హోమం నిర్వహించారు. ప్రతి నెల పౌర్ణమి తిథినాడు దేవాలయంలో ఈ హోమం నిర్వహించడం ఆనవాయితీ. అందులో భాగంగా నిర్వహించిన హోమంలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ హోమం వల్ల నరఘోష, శత్రుఘోష, రుణ బాధ నివారణ, గ్రహశాంతి, కార్యసిద్ధి లభిస్తాయని దేవాలయ ఈవో అల్లు జగన్నాథం తెలిపారు. హోమం అనంతరం భక్తులకు ప్రసాదం అందజేశారు.

30 నుంచి అయ్యప్పలకు అన్న సంతర్పణ

అల్లిపురం : శ్రీ హరిహరాత్మజ అన్నదాన ఛారిటబుల్ ట్రస్ట్, వైర్లెస్ కాలనీలో వెలసిన శ్రీ కోదండ రామాలయం సంయుక్తంగా మండలకాల మహా అన్నప్రసాద వితరణ మహోత్సవాన్ని ఈ నెల 30న ప్రారంభిస్తున్నట్లు గురుస్వాములు కడగల శ్రీను, కంచుమూర్తి వెంకటరమణ మూర్తి తెలిపారు. వైర్లెస్ కాలనీ కోదండ రామాలయంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు పాల్గొని వివరాలు వెల్లడించారు. మాలదారులందరికీ మండల కాలం పాటు ప్రతి ఏడాది మాదిరిగా అన్నప్రసాద వితరణ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రతి రోజు మధ్యాహ్నం 12.30 నుంచి 2.30 గంటల వరకు అన్నప్రసాద కార్యక్రమం చేపడుతున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో స్వాములు కోటేశ్వరరావు, మన్మథరావు, అవతార్, లక్ష్మీనారాయణ, శ్రీనివాసరావు, బాల శంకర్, సుబ్రహ్మణ్యస్వామి ఆలయ పెద్దలు పాల్గొన్నారు.

వృద్ధుడు అదృశ్యం



సబ్బి తాతబాబు

సీతమ్మధార : ద్వారకానగర్‌లోని సూర్య మహల్ అపార్టుమెంట్‌లో వాచ్‌మేన్‌గా తాతబాబు (58) పని చేస్తున్నాడు. దసరా సందర్భంగా అతని కుమారుడు స్వామి మాల వేసి 23వ తేదీన కుటుంబ సభ్యులతో విజయవాడ వెళ్లారు. ఇంట్లో మేనల్లుడు, మనవడు ఉంటున్నారు. కుటుంబ సభ్యులు విజయవాడ నుంచి తిరిగి వచ్చేసరికి ఇంట్లో తాతబాబు కనిపించకపోవడంతో బంధువులు, స్నేహితుల ఇళ్లకు వెళ్లి అడిగితే రాలేదని చెప్పడంతో శనివారం ద్వారకా పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలియజేశారు.

ఏఎస్‌ఐపై దాడి చేసిన పది మందిపై కేసు

సీతమ్మధార: ఫోర్త్‌టౌన్ ఏఎస్‌ఐపై దాడికి పాల్పడిన పది మందిపై పోలీసులు కేసు నమోదు చేశారు. వారు తెలిపిన వివరాలిలా.. ఫోర్త్‌టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని రామకృష్ణానగర్ తొండం వినాయకుడి గుడి వద్ద దసరా నవరాత్రుల సందర్భంగా దుర్గాదేవి విగ్రహం అనుపు కార్యక్రమంలో భాగంగా డీజే సౌండ్స్ ఎక్కువగా రావడంతో స్థానికులు డయల్ 112కు కాల్ చేశారు. నైట్ రౌండ్స్‌లో ఉన్న ఫోర్త్‌టౌన్ ఏఎస్‌ఐ శివకృష్ణ అక్కడికి వెళ్లి నిర్వాహకులకు సౌండ్ తగ్గించాలని చెప్పారు. వారిలో మద్యం తాగిన మత్తులో ఉన్న కొంత మంది ఏఎస్‌ఐ విధులకు ఆటంకం కలిగించారు. వెంకటసూర్యనారాయణతో కలిసి పది మంది ఆయనపై దాడి చేశారు. స్టేషన్ అధికారి విజయకుమార్‌కు కాల్ చేసి విషయం చెప్పడంతో.. ఆయన సంఘటనా స్థలానికి చేరుకున్నారు. దీంతో కొంత మంది యువకులు పారిపోయారు. రంగంలోకి దిగిన పోలీసులు పది మందిని గుర్తించి వారిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఆరోగ్య సురక్షతో.. సంపూర్ణ భరోసా



లబ్ధిదారులకు మందులు అందజేస్తున్న కర్రి నీలకంఠం తదితరులు



కొబ్బరితోటలోని డాక్టర్ వైఎస్సార్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో రోగుల పేర్లు నమోదు చేస్తున్న వైద్య సిబ్బంది

- కొబ్బరితోట-2 సచివాలయం పరిధిలో 531 మందికి వైద్య పరీక్షలు
- మెరుగైన వైద్యం నిమిత్తం కేజీహెచ్‌కు ఐదుగురి సిఫారసు

అల్లిపురం : ప్రజల సంపూర్ణ ఆరోగ్యమే లక్ష్యంగా ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రవ్యాప్తంగా నిర్వహిస్తున్న జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమానికి ప్రజల నుంచి విశేష స్పందన వస్తోందని 33,34,35,41 వార్డుల క్లస్టర్-3 మండల అధ్యక్షుడు కర్రి నీలకంఠం అన్నారు. కొబ్బరితోట-2 సచివాలయం పరిధిలోని డాక్టర్ వైఎస్సార్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో నిర్వహించిన శిబిరంలో ప్రజలు పాల్గొని వైద్య పరీక్షలు చేయించుకున్నారు. సుమారు 531 మందిని వైద్యులు పరీక్షించారు. వారిలో ఐదుగురిని మెరుగైన వైద్యం నిమిత్తం కేజీహెచ్‌కు రిఫర్ చేశారు. అవసరమైన వారికి మందులు ఉచితంగా అందజేశారు. ఇందుకోసం సుమారు 200 రకాల మందులు సిద్ధంగా ఉంచారు. అంగన్‌వాడీ కార్యకర్తలు పోషకాహారంపై అవగాహన కల్పించారు. గర్భిణులు, బాలింతలు, చిన్నపిల్లలకు పోషకాహారం నిమిత్తం ఏ ఆహార పదార్థాలు తీసుకోవాలో వివరించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు దూడ అప్పారావు, తాతబ్బాయి పాల్గొని సహకారం అందజేశారు.


రెల్లివీధిలో..



రెల్లివీధి శిబిరానికి వచ్చిన వారికి మందులు అందజేస్తున్న కార్పొరేటర్ అప్పలరత్నం

మహారాణిపేట : ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని 30వ వార్డు కార్పొరేటర్ కోడూరు అప్పలరత్నం అన్నారు. శనివారం నియోజకవర్గంలోని రెల్లివీధిలో జరిగిన శిబిరంలో పాల్గొని ప్రసంగించారు. స్థానిక ప్రజా ప్రతినిధులు, కార్యకర్తలు, సచివాలయ కన్వీనర్లు, స్థానికులు, ఆశ వర్కర్లు, ఏఎన్ఎంలు, వలంటీర్లు, పార్టీ నాయకులు పెంటపల్లి సత్యనారాయణ, దశమంతుల చిన్ని, సూర్యనారాయణ, రాము తదితరులు పాల్గొన్నారు.

మూతపడ్డ ఆలయాలు



మూతపడ్డ ఆంజనేయస్వామి ఆలయం



జగన్నాథస్వామి ఆలయం మూసివేసిన దృశ్యం

డాబాగార్డెన్స్ : పాక్షిక చంద్రగ్రహణం సందర్భంగా నగరంలోని బురుజుపేటలో వెలసిన కనక మహాలక్ష్మి దేవస్థానం శనివారం మధ్యాహ్నం 2 గంటలకు మూసివేశారు. గ్రహణానంతరం ఆదివారం ఉదయం 6 గంటలకు సంప్రోక్షణ నిర్వహించి 7 గంటల నుంచి దర్శనాలు కల్పించనున్నట్లు ఏఈవో కె. తిరుమలేశ్వరరావు తెలిపారు. ఇసుక కొండ (బాబాజీకొండ)పై వెలసిన రమాసహిత సత్యనారాయణ స్వామి ఆలయంలో పౌర్ణమి పూజలు అనంతరం ఆలయాన్ని మూసివేశారు. సంప్రోక్షణ అనంతరం దేవాలయ సర్వదర్శనం ఉంటుందని ఆలయ ప్రధాన అర్చకుడు ఫణిహారం నరసింహమూర్తి, ఈవో బుద్ధ మహాలక్ష్మి నగేష్ తెలిపారు. మహారాణిపేట అంబికాబాగ్‌లో కనకమహాలక్ష్మి దత్తత దేవాలయమైన అంబికాబాగ్ సీతారామచంద్రస్వామి ఆలయంలో శనివారం వాల్మీకి జయంతి, శ్రీరామ పట్టాభిషేకం, ఆంజనేయస్వామికి తమలపాకులతో పూజ, సామూహిక హనుమాన్ చాలీసా పఠనం, గోపూజ అనంతరం మధ్యాహ్నం 1 గంటకు ఆలయాన్ని మూసివేశారు. సంప్రోక్షణ అనంతరం ఆదివారం ఉదయం 9 గంటల నుంచి దర్శనాలు ఉంటాయని ఆలయ ఏఈవో తిరుమలేశ్వరరావు తెలిపారు. అదే విధంగా సూర్యాబాగ్ మెయిన్‌రోడ్డులో గల విశ్వేశ్వరాలయం, టౌన్‌కొత్తరోడ్డులో గల జగన్నాథస్వామి ఆలయం, పూర్ణామార్కెట్ వెలంపేటలో గల దుర్గాలమ్మ ఆలయం, ఆంజనేయ స్వామి ఆలయం, పోర్టు వేంకటేశ్వరస్వామి, బాబా ఆలయాలు, రామాలయాలు చంద్రగ్రహణం సందర్భంగా మూతబడ్డాయి.

పలు ఆలయాల మూసివేత..

అల్లిపురం : వేంకటేశ్వరమెట్టపై గల శ్రీ వేంకటేశ్వరస్వామి దేవస్థానం, అస్సాంగార్డెన్స్‌లో గల శ్రీ నీలమ్మ వేపచెట్టు అమ్మవారి దేవస్థానం, శ్రీ శివరామకృష్ణ దేవస్థానం, డీబీకే రైల్వే క్వార్టర్స్‌లో గల శ్రీ భవానీ శంకర దేవాలయం మూసివేశారు. తిరిగి ఆదివారం ఉదయం సంప్రోక్షణ అనంతరం విశేష అభిషేకాలు చేపట్టిన తర్వాత భక్తులకు దర్శనాలు కల్పించనున్నట్లు దేవాలయ అధికారులు తెలిపారు.



మూసివేసిన నీలమ్మ వేపచెట్టు అమ్మవారి దేవస్థానం

నీలమ్మ వేపచెట్టు అమ్మవారి ఆలయంలో పౌర్ణమి పూజలు



విశేష అలంకరణలో నీలమ్మ వేపచెట్టు అమ్మవారి ఉత్సవ విగ్రహం



హోమంలో పాల్గొన్న ఆలయ చైర్‌పర్సన్ విజయలక్ష్మి దంపతులు

అల్లిపురం : అస్సాం గార్డెన్స్‌లో వెలసిన నీలమ్మ వేపచెట్టు అమ్మవారి దేవస్థానంలో శనివారం ఆశ్వయుజ పౌర్ణమిని పురస్కరించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు జోగారావు శర్మ ఆధ్వర్యంలో దేవస్థానం చైర్‌పర్సన్ బొర్రా విజయలక్ష్మి, శ్రీనివాసరెడ్డి దంపతులచే అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం మండపారాధన, అగ్నిప్రతిష్ట, ఆవాహనం చేపట్టారు. పూర్ణాహుతితో హోమం పరిసమాప్తం అయింది. కార్యక్రమంలో కమిటీ సభ్యులు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

బౌద్ధాలయంలో పౌర్ణమి పూజలు

కంచరపాలెం: ఆశ్వయుజ మాస శుద్ధ పౌర్ణమి సందర్భంగా శనివారం కంచరపాలెం అశోక్‌నగర్‌లోని బౌద్ధాలయంలో బుద్ధుడికి ప్రత్యేక పూజలు చేశారు. ఆంధ్ర బౌద్ధ కేంద్ర సమాజం ప్రధాన కార్యదర్శి కె.రాజుగణేష్ ఆధ్వర్యంలో సీనియర్ ఉపాసకుడు కోన వెంకటరావు ఈ కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథులు మయన్మార్ ఆంధ్ర రీప్యాట్రియేట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు ఏఎం ఫ్రెడ్డీ, కార్యదర్శి మోహన్‌రావు బుద్ధుడి చరిత్ర పుస్తకాన్ని ఆవిష్కరించారు. పేద మహిళలకు చీరలు పంపిణీ చేశారు. మధ్యాహ్నం పేదలకు అన్నదానం జరిపారు. కార్యక్రమంలో రాజు, భీమారావు, రాము, రామచంద్రరావు, పరిమళ, సునీల్, సమాజం సభ్యులు పాల్గొన్నారు.

ముగిసిన దసరా ఉత్సవాలు



పూర్ణాహుతి నిర్వహిస్తున్న ఎమ్మెల్యే వాసుపల్లి కుటుంబ సభ్యులు

డాబాగార్డెన్స్ : ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ నేతృత్వంలో 104 ఏరియా వైజాగ్ డిఫెన్స్ అకాడమీలో నిర్వహిస్తున్న దసరా ఉత్సవాలు శనివారంతో ముగిసాయి. ఈ సందర్భంగా నిర్వహించిన పూర్ణాహుతి కార్యక్రమంలో ఎమ్మెల్యే కుటుంబ సభ్యులు పాల్గొన్నారు. అనంతరం ఎమ్మెల్యే వాసుపల్లి మాట్లాడుతూ లోకకల్యాణాన్ని కాంక్షిస్తూ గత 30 ఏళ్లుగా శరన్నవరాత్రి ఉత్సవాలు నిర్వహిస్తూ వస్తున్నామన్నారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి పాలనకు అమ్మవారి అనుగ్రహం తోడు కావాలని, అమ్మ ఆశీస్సులతో రాబోయే సార్వత్రిక ఎన్నికల్లో అత్యధిక మెజార్టీతో గెలిచి ముఖ్యమంత్రి కావడం ఖాయమన్నారు. వైజాగ్ డిఫెన్స్ అకాడమీ, రామబాణం కళాశాల సిబ్బంది, పార్టీ నాయకులు, కార్యకర్తలు, విద్యార్థులు పాల్గొన్నారు

తొలి దశలోనే గమనిస్తే రొమ్ము క్యాన్సర్ ప్రమాదం కాదు

మహారాణిపేట : రొమ్ము క్యాన్సర్ మాసోత్సవాల సందర్భంగా కారుణ్య క్యాన్సర్-ఎయిడ్స్ ఫౌండేషన్, బ్రింద ఆస్పత్రి సంయుక్త ఆధ్వర్యంలో దండు బజార్‌లో ఉన్న జీవీఎంసీ ఉన్నత పాఠశాలలో తొమ్మిది, పది తరగతుల విద్యార్థినులకు రొమ్ము క్యాన్సర్‌పై అవగాహన కల్పించారు. బ్రిందా క్యాన్సర్ ఆస్పత్రి వైద్యురాలు మౌనిక పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా విద్యార్థినులకు రొమ్ములో వచ్చే మార్పులు, క్యాన్సర్‌కు గల కారణాలు, కణితులు, గడ్డలను ఏ విధంగా సొంతంగా పరీక్ష చేసుకోవచ్చో అవగాహన కల్పించారు. క్యాన్సర్ సంభవించకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు. ఈ కార్యక్రమంలో కారుణ్య క్యాన్సర్ ఫౌండేషన్ చైర్మన్ జంగం జోషి, కార్యదర్శి కోన ప్రకాష్, స్కూల్ హెచ్ఎం జనార్దనరావు, ఆంగ్ల ఉపాధ్యాయుడు మోహనరావు, ఎన్జీవో ఫౌండర్ కోడూరు రూప, ఆర్ఎంపీ వైద్యుల సంఘం నాయకుడు పచ్చిపులుసు కనకారావు, ఆస్పత్రి సిబ్బంది బాబ్జి తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థినులకు అవగాహన కల్పిస్తున్న డాక్టర్ మౌనిక

రంగిరీజువీధిలో అన్నదానం



అన్న ప్రసాదం వడ్డిస్తున్న సీతంరాజు సుధాకర్



అన్నదానం చేస్తున్న మన్యాల

డాబాగార్డెన్స్ : జీవీఎంసీ 36వ వార్డు రంగిరీజు వీధిలో నీలమాంబ బాయ్స్ ఆటో స్టాండ్ సభ్యుడు బొడ్డేటి కిరణ్ నేతృత్వంలో నిర్వహిస్తున్న దేవీ శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా శనివారం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకుడు సీతంరాజు సుధాకర్ పాల్గొని అమ్మవారికి పూజలు చేసి అన్నదానం ప్రారంభించారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు చెన్నా జానకీరామ్, ఉరికిటి నారాయణ, మాజీ కార్పొరేటర్ కొప్పుల వెంకట్రావు, పార్టీ నాయకులు కోరుకొండ సూర్యప్రసాద్, రంధి గోపి, నిఖిలేష్, కుంచెయ్య, ఆటోస్టాండ్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

రామజోగిపేటలో..

జీవీఎంసీ 29వ వార్డు రామజోగిపేటలో సాయి దుర్గ సిద్ధు బాయ్స్ ఆటోస్టాండ్ కోన వీరుబాబు ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న దేవీ శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా శనివారం మహాన్నదాన కార్యక్రమం నిర్వహించారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ విశాఖ జిల్లా బీసీ సంఘం అధ్యక్షుడు మన్యాల శ్రీనివాస్ పాల్గొని అమ్మవారికి పూజలు చేసి అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు, ఆటోస్టాండ్ సభ్యులు పాల్గొన్నారు.

జీవీఎంసీ సీసీపీ సురేష్‌కు అభినందనలు



సురేష్‌కుమార్‌కు అభినందనలు తెలుపుతున్న అసోసియేషన్ ప్రతినిధులు

డాబాగార్డెన్స్ : జీవీఎంసీ చీఫ్ సిటీ ప్లానర్‌గా బాధ్యతలు చేపట్టిన బి. సురేష్‌కుమార్‌కు టౌన్‌ప్లానింగ్ అధికారుల అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు కె. వెంకటేశ్వరరావు, పలువురు అసోసియేషన్ ప్రతినిధులు శనివారం అభినందనలు తెలిపారు. టౌన్‌ప్లానింగ్ అధికారుల సహాయ సహకారాలు సురేష్‌కు ఎల్లవేళలా ఉంటాయని తెలిపారు. జీవీఎంసీ నగరాభివృద్ధిలో సురేష్ కృషి ఎనలేనిదన్నారు. జి-20, ప్రెసిడెంట్ ఫ్లీట్ రివ్యూ, మాస్టర్‌ప్లాన్ రూపకల్పన, బీపీఎస్‌తో పాటు అనేక రోడ్ల విస్తరణ కార్యక్రమాలు సురేష్ సారథ్యంలో నిర్వహించామని తెలిపారు. టౌన్‌ప్లానింగ్ అధికారులు రమణ, వెంకట్రావు, నాయుడు తదితరులు పాల్గొన్నారు.

నిత్యావసర సరకుల అందజేత



పందిమెట్టలో నిత్యావసర సరకులు అందజేస్తున్న పీతల వాసు, పార్టీ నాయకులు




జాలారిపేటలో సరకులు అందజేస్తున్న చీకటి రమేష్

డాబాగార్డెన్స్ : జీవీఎంసీ 29వ వార్డు పందిమెట్ట ప్రాంతానికి చెందిన వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యకర్త మజ్జి అప్పలరాజు ఊపిరితిత్తుల సమస్యతోనూ, అతని భార్య మజ్జి లక్ష్మి గైనకాలజీకి సమస్యతో ఇటీవలే శస్త్ర చికిత్స చేయించుకున్న సందర్భాన్ని పురస్కరించుకుని ఏపీ ఫారెస్ట్ డిపార్టుమెంట్ డైరెక్టర్ పీతల వాసు తన వంతు సాయంగా బియ్యం బస్తాతో పాటు కిరాణా సరకులు అందజేశారు. జగన్నాథస్వామి ఆలయ ధర్మకర్త వాకాడ రాధ, బెవర మహేష్, కంచర్ల రవి (బుల్లెట్ రవి), పార్టీ నాయకులు కోరాడ సురేష్, ఆరుగుల రాజ్‌కుమార్ సహాయ సహకారాలతో వాటిని అందజేశారు. కార్యక్రమంలో ఆంజనేయస్వామి ఆలయ ధర్మకర్త ఎలమంచిలి సంతోష్, కనకల రాజు తదితరులు పాల్గొన్నారు.


జాలారిపేటలో..

జనం కోసం జనసేన కార్యక్రమంలో భాగంగా 37వ వార్డు జాలారిపేటలో కాసరపు అమెరికన్ బాబు, వాడమోదుల యల్లయ్యమ్మ, పిల్లా నూకరత్నంకు ఆ పార్టీ నియోజకవర్గ నాయకుడు చీకటి రమేష్ నిత్యావసర సరకులు అందజేశారు. కార్యక్రమంలో ఎర్రంశెట్టి సురేష్‌కుమార్, ఆనంద గణపతి యూత్ అసోసియేషన్ సభ్యులు చింతపల్లి వెంకటరమణ, వాడమోదుల పోలరాజు, ప్రసాద్, తాతాజీ, ఒలిశెట్టి రాజమ్మ, చింతపల్లి శాంతి, అర్జిల్ల ఎల్లాజీ తదితరులు పాల్గొన్నారు.

వాల్మీకి మహర్షి జీవితం స్ఫూర్తిదాయకం



వాల్మీకి చిత్రపటం వద్ద నివాళి అర్పిస్తున్న జాయింట్ కలెక్టర్ విశ్వనాథన్



అల్లిపురం శాఖా గ్రంథాలయంలో వాల్మీకి చిత్రపటం వద్ద నివాళులు అర్పిస్తున్న పాఠకులు

మహారాణిపేట : ఆదికవి వాల్మీకి మహర్షి జీవితం స్ఫూర్తిదాయకమని జాయింట్ కలెక్టర్ కె.ఎస్.విశ్వనాథన్ కొనియాడారు. జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో వాల్మీకి జయంతిని కలెక్టర్ సమావేశ మందిరంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆదికవి వాల్మీకి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. వాల్మీకి మహర్షి రామాయణం రచించిన ఆదికవిగా గుర్తింపు పొందారని జేసీ తెలిపారు. ఆయన జీవితాన్ని ఆదర్శంగా తీసుకుని ఉన్నత లక్ష్యాల వైపు పయనించాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి కె.మోహన్‌కుమార్, బీసీ సంక్షేమ శాఖ అధికారి శ్రీదేవి, ఏవో ఈశ్వరరావు, కలెక్టరేట్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.


అల్లిపురం శాఖా గ్రంథాలయంలో..

అల్లిపురం : వాల్మీకి మహర్షి జయంతి అల్లిపురం శాఖా గ్రంథాలయంలో శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రంథాలయాధికారి పీవీఎస్ రాజు, పాఠకులు పాల్గొని వాల్మీకి మహర్షి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. వాల్మీకి జీవిత చరిత్రను మననం చేసుకున్నారు.

ముగిసిన ధర్మప్రచార వారోత్సవాలు

సీతమ్మధార : దొండపర్తిలో వెలసిన ఎరుకుమాంబ అమ్మవారి ఆలయంలో శనివారంతో ధర్మప్రచార వారోత్సవాలు ఘనంగా ముగిసాయి. ఆలయ ఈవో జి.వి.రమాబాయి ఆధ్వర్యంలో అర్చకులు శ్రీనివాస్ నేతృత్వంలో అమ్మవారికి ఘనంగా పూజలు నిర్వహించారు. వారోత్సవాల సందర్భంగా ప్రతిరోజూ సాయంత్రం ఆలయ ప్రాంగణంలో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. శనివారం నాటి కార్యక్రమంలో ఆధ్యాత్మికవేత్త ఎం.వి. రాజశేఖర్ వ్యాఖ్యాతగా వ్యవహరించారు. ఉదయం 10 గంటల నుంచి 12 గంటల వరకు లలితా మాతృ మండలి సభ్యులు సామూహిక పారాయణ చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ ట్రస్టీ చైర్మన్ నీలాపు సర్వేశ్వరెడ్డి, భక్తులు పాల్గొన్నారు.

సత్యదేవుని ఆలయంలో పౌర్ణమి పూజలు



రమా సహిత సత్యనారాయణ స్వామి



సామూహిక వ్రతాల్లో పాల్గొన్న భక్తులు

- ఇసుకకొండకు పోటెత్తిన భక్తులు

డాబాగార్డెన్స్ : నగరంలోని ఇసుకకొండ (బాబాజీ కొండ)పై వెలసిన రమా సహిత సత్యనారాయణ స్వామి ఆలయం శనివారం భక్తులతో కిటకిటలాడింది. ఆశ్వీయుజ పౌర్ణమి సందర్భంగా స్వామికి ప్రత్యేక పూజలు, పంచామృతాభిషేకాలు జరిపారు. వేకువ జాము 4 గంటల నుంచే భక్తులు స్వామి దర్శనానికి బారులు తీరారు. ఆలయ మండపంలో సామూహిక సత్యనారాయణస్వామి వ్రతాలు జరిగాయి. ఈవో బుద్ధ మహాలక్ష్మి నగేష్ పర్యవేక్షించారు. మధ్యాహ్నం వరకు భక్తుల తాకిడి కనిపించింది. భక్తుల సౌకర్యార్థం సర్వదర్శనంతో పాటు రూ.20, రూ.200, రూ.300 టికెట్లు అందుబాటులో ఉంచారు. వేకువజాము 4 గంటలకు అనివెట్టి మండపం వద్ద సామూహిక వ్రతాలు, ప్రత్యేక పూజలు జరిపారు. ధ్వజస్తంభ పూజలు జరిగాయి. పూజల అనంతరం చంద్రగ్రహణం సందర్భంగా ఆలయాన్ని మూసివేశారు.

పోలీసులకు ఉచిత వైద్య శిబిరం



పోలీసులకు పరీక్షలు చేస్తున్న వైద్య సిబ్బంది

దొండపర్తి : పోలీస్ అమరవీరుల సంస్మరణ వారోత్సవాల సందర్భంగా నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ ఎ.రవి శంకర్ ఆదేశాల మేరకు పోలీసు అధికారులు, సిబ్బంది వారి కుటుంబ సభ్యులకు పోలీస్ రీజనల్ ఆస్పత్రిలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ముందుగా పోలీస్ కల్యాణ మండపంలో ఆరోగ్య జీవన విధానంపై అవగాహన కల్పించారు. అనంతరం కేర్, మెడికవర్ ఆస్పత్రుల ఆధ్వర్యంలో జరిగిన ఈ శిబిరంలో సుమారు 100 మంది పోలీస్ సిబ్బంది వారి కుటుంబ సభ్యులు పాల్గొని పరీక్షలు చేయించుకున్నారు.

తెలుగు రాష్ట్రాల్లో బీసీలు ముఖ్యమంత్రులు కావాలి



మాట్లాడుతున్న డాక్టర్ కె.ఎ.పాల్

సీతమ్మధార : తెలుగు రాష్ట్రాల్లో బీసీలు ముఖ్యమంత్రులు కావాలని ప్రజాశాంతి పార్టీ అధ్యక్షుడు డాక్టర్ కె.ఎ. పాల్ అన్నారు. శనివారం ఆశీలమెట్టలో గల పార్టీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ పలు బీసీ సంఘాలు తమ పార్టీకి మద్దతు ప్రకటించినట్లు తెలిపారు. విశాఖ పార్లమెంట్ నియోజకవర్గం పరిధిలో నాలుగు లక్షల మంది క్రైస్తవ ఓటర్లు ఉన్నారని, ఐదు వేల చర్చిలు ఉన్నాయన్నారు. తుమ్మిడి బ్రదర్స్ అధినేత రామ్‌కుమార్, పలువురు మహిళలను పార్టీలోకి ఆహ్వానించారు. ప్రజాశాంతి పార్టీ కార్యాలయంలో నవంబర్ 9వ తేదీన 10 గంటలకు బీసీ మహాసభ జరుగుతుందన్నారు. శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం, ఉభయ గోదావరి జిల్లాల బీసీ సంఘాలు పాల్గొంటాయని తెలిపారు. తాను వచ్చే ఎన్నికల్లో విశాఖ ఎంపీగా పోటీ చేస్తానన్నారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణను తానే అడ్డుకున్నానన్నారు. తుమ్మిడి బ్రదర్స్ అధినేత రామ్‌కుమార్, బీసీ నాయకులు ఎస్.ఎ.రమణ, ఎస్సీ అప్పారావు, పలువురు మహిళలను పార్టీలోకి ఆహ్వానిస్తూ పార్టీ కండువాలు కప్పారు.